# సినీ మాయ

## మినీ కథ

ఆదివారం. ఇంట్లో పిల్లలు సినిమా ప్రోగ్రాం వేసారు.

"మేంకూడా వస్తాం మంచి సినిమా సెలక్ట్ చెయ్యరా అబ్బాయ్" అన్నారు అమ్మా నాన్నా.

'సకుటుంబంగా చూడగలిగే సినిమా ఊళ్ళో ఏం వుందా' అని పేపరు తిరగేసాను. మహత్తరమైన కథా వస్తువుతో, వినూత్నమైన సెంటిమెంటుతో అన్ని వయసులవారినీ అలరించే మంచి కుటుంబగాథా చిత్రం "తేనెహృదయాలు." దానికే బయలుదేరాం.

అదృష్టం బాగుండి టిక్కెట్లు దొరికేయి. టీ త్రాగి పిల్లలకి చాక్‌లెట్లుకొని హాల్లోకి ప్రవేశం చేసాం. నాకు ఒక ప్రక్క శ్రీమతి, రెండో ప్రక్క అమ్మా నాన్నా కూచున్నారు. మా ప్రక్క పిల్లలు ముగ్గురూ కూచున్నారు. నాకు ఇద్దరబ్బాయిల తర్వాత ఓ అమ్మాయి సంతానం. పాప వాళ్ళమ్మ ప్రక్క కూచుంటానంది కానీ, వల్లకాక అన్నల ప్రక్క కూచుంది.

టైటిల్సు పూర్తికాగానే తెరమీద భక్తిపాట ఒకటి మొదలయింది. హీరోయిను కాబోలు పాట పాడుతూ కళ్ళు మూసుకునివుంది. అమ్మ భక్తి పారవశ్యంతో ఆ తెరమీద దేవుడికి దండం పెట్టేస్తూ "మంచి సినిమాకే తెచ్చాడు స్మీ అబ్బాయి" అని నాన్నతో అంటూండడం వినిపించింది.

సినిమా మరో అరగంటసేపు అప్పడాల పిండిలా సాగింది. తెరమీద అన్నా చెల్లెళ్ళు గట్టిగా కౌగలించేసుకుని ఎందుకో తెగ ఏడిచేస్తున్నారు. మా శ్రీమతి కొంచెం యిబ్బందిగా కదిలింది. నా పరిస్థితీ అలాగేవుంది. "నేనలా చుట్ట కాల్చుకొస్తాను" అని లేవబోయేరు నాన్న. అమ్మ కసరడంతో ఆ ప్రయత్నం విరమించుకున్నారు.

ఇంతలో పిల్లలు తగువులాడుకోడం వినిపించింది. సంగతేమిటని శ్రీమతివేపు ప్రశ్నార్థకంగా చూసేను. "చాక్లెట్లన్నీ చంటాడు తినేసాడుట. అది కావాలని ఏడుస్తోంది."


"నేనెలాగూ టీ తాగడానికి వెళ్దామనుకొంటున్నాను. కొనితెస్తాలే" అని లేవబోయేను.

శ్రీమతి "సినిమా చూడండి-ఇప్పుడేం బయటకి వెళ్ళడానికి వీల్లేదు" అంది కోపంగా. మళ్ళీ కుర్చీలో చతికిలబడ్డాను.

ఇంతలో తెరమీద ఒకహీరో పదిమందితో భీకరంగా పోట్లాటటం ప్రారంభించేడు. తెరమీద వాళ్ళు ఫైటు ప్రారంభించేసరికి పప్పీ అల్లరి మానేసి బుద్ధిగా చూడడం ప్రారంభించింది.

అబ్బాయిల సంగతి సరేసరి. హాలుదద్దరిల్లిపోతోంది.

తర్వాత సీను "ఛీ ! రాక్షసుడా ! వదులు" అన్న హీరోయిను కేకలతో మొదలయింది. ఈలలతో కేకలతో హాలు మారుమ్రోగిపోతోంది. రేపుసీను మొదలవుతోందని ఆ స్టాక్ డైలాగు వింటేనే తెలిసిపోతోంది. హీరోయిను వంటిమీద చీర విలన్ లాగేసాడు. జాకెట్ చింపేసాడు. లంగాబొందు పట్టుకుని లాగడానికి అవస్తపడుతున్నాడు. హీరోయిన్ తను పదిలంగా దాచుకున్న పరువాలని విలన్ కంటపడకుండా




జాగ్రత్తపడుతూ ప్రేక్షకులకి మాత్రం ఒడుపుగా చూపెడుతోంది. అమ్మ సణుగుడు మొదలెట్టింది. నాన్న దిక్కులు చూస్తున్నారు. శ్రీమతి పిల్లల దృష్టిని మరలించేందుకు ప్రయత్నిస్తోంది కానీ వాళ్ళిలోకంలోనేలేరు.

ఇంతలో అమ్మ మాటలు వినిపించేయి. "చుట్ట కాల్చుకుంటానన్నారు-పదండి, నాక్కూడా ఉక్కపోతగా ఉన్నట్టనిపిస్తోంది. అలా బయటికెళ్ళివద్దాం." అమ్మా నాన్నా నెమ్మదిగా బయటకి కదిలేరు. రేప్‌సీన్ ఇంకా సాగుతూనే ఉంది. తెరమీద విలన్ హీరోయిన్‌ల పరుగు పందెం సాగుతోంది.

"ఏమండీ. టీ తాగుతానన్నారు కదా. బయటకి వెళ్దాంరండి" అంటూ చటుక్కున లేచింది శ్రీమతి. నేనూ లేచేను.

ఇలాంటి సీన్లు పిల్లలు చూడ్డం నాకిష్టం లేదు. బిస్కెట్లూ, చాక్‌లెట్లూ కొంటాను రమ్మని పిలిచేను వాళ్ళని.

"మేం రాంనాన్నా-ఇంటర్వెల్‌లో వెళ్దాం" అన్నారు వాళ్ళు.

"ఇది ఫైటింగ్ సీన్‌కదర్రా-ముందు ముందు ఇంకా ఫైటింగ్‌సీన్లు చాలా ఉన్నాయి-అప్పుడు చూడొచ్చు-పదండి బయటకివెళ్ళి అన్నీ కొనుక్కొద్దాం" అన్నాను ఆశ చూపిస్తూ.

వాళ్ళు ముగ్గురూ ఫక్కున నవ్వేరు: "ఇదేంటి నాన్నగారూ ఇది ఫైటింగ్ సీనంటారు, రేప్‌సీనయితే !" అన్నారు నా అజ్ఞానానికి నవ్వేస్తూ.

పసివాళ్ళని కూడా ఇంతగా ఎడ్యుకేట్ చేయగలగిన తెలుగు సినిమాకి మనసులోనే జోహార్లు అర్పించుకుంటూ నోటమాటరాక ఉండిపోయేను !